ఎరువులకు కిరికిరి

- డీలర్లు.. రైతులపై రవాణా ఛార్జీల భారం
- లింకు ఎరువుల పరిమాణం పెంపుతో సతమతం
- ఆందోళనలకు సమాయత్తం అవుతున్న డీలర్లు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎరువుల విక్రయాల్లో కేంద్ర ప్రభుత్వం కిరికిరి పెడుతోంది. కొత్త కొత్త నిబంధనలు తీసుకొస్తూ రైతులపై భారం మోపుతోంది. ప్రయివేటు డీలర్లపై రవాణా ఛార్జీలు పడుతుండటంతో ఆ భారాన్ని వారు రైతులపై వేస్తున్నారు. మరోవైపు లింకు ఎరువుల పరిమాణం పెంపుతోనూ డీలర్లు సతమతం అవుతున్నారు. సబ్సిడీ భారాన్ని తగ్గించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యూహాలు పన్నుతోంది. దీనిలో భాగంగా ద్రవ రూపంలో ఉండే నానో యూరియా, డిఏపిల వాడకాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతోంది. లింకు ఎరువుల పరిమాణం పెంపును దీనికోసం ఆయుధంగా వాడుతోంది. రూ.6 లక్షల విలువైన కాంప్లెక్స్ ఎరువులు విక్రయిస్తేనే రూ.లక్ష యూరియా సరఫరా చేస్తామని షరతు పెడుతుండటంతో డీలర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. రవాణా చార్జీల పేరుతో బస్తా ఎరువుపై రూ.30కి పైగా అదనపు చార్జీని రైతుల నుంచి డీలర్లు వసూలు చేస్తున్నారు.

విక్రయాలు నిలిపివేయాలని డీలర్ల తీర్మానం

కేంద్ర ప్రభుత్వ తీరుపై ఎరువుల డీలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేట్ డీలర్లకు యూరియా, డిఏపి సరఫరాను కంపెనీలు తగ్గించటంతో పాటు కాకుండా లారీ కిరాయిల భారం మోపుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండేండ్లుగా లింకు ఎరువుల పరిమాణాన్ని పెంచుతూ యూరియా, డిఏపికి ఆరు రెట్లు అదనంగా కాంప్లెక్స్ ఎరువులు విక్రయించాలని కంపెనీలు కండీషన్ పెడుతున్నాయని వాపోతున్నారు. మార్క్‌ఫెడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రోస్ సేవా సంస్థలు, మన గ్రోమోర్, హాకా వంటి ప్రభుత్వరంగ సంస్థలపై పడే భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. డీలర్లపై పడే భారాన్ని మాత్రం అంతిమంగా రైతులపైనే మోపుతున్నారు. అయినా ప్రభుత్వాలు పట్టకపోవటం గమనార్హం.

నిల్వ ఉంచే స్థాయిలో ఎరువులు రావట్లే..!

నిల్వ ఉంచే స్థాయిలో ఎరువుల సరఫరా లేదని డీలర్లు అంటున్నారు. ఖమ్మం నుంచి వివిధ జిల్లాలకు సరఫరా అయ్యే వ్యాగన్ పాయింట్లను కూడా పందిళ్లపల్లికి మార్చడంతోనూ కొంతమేర రవాణా చార్జీలు పెరిగాయి. సరఫరా చేసే ఎరువులోనూ దాదాపు 60శాతానికి పైగా ప్రభుత్వ రంగ సంస్థలకే పంపుతున్నారు. 40శాతం మాత్రమే ప్రయివేటు డీలర్లకు కేటాయిస్తున్నారు. ఒక్క ఖమ్మం జిల్లాలోనే 60వరకు ప్రభుత్వరంగ సంస్థలు ఉండగా ఎరువుల డీలర్లు 200 మంది వరకు ఉన్నారు. 60 వరకు ఉన్న పీఏసీఎస్‌లకు 60% పంపుతుండగా, 200 వరకు ఉన్న ప్రయివేటు డీలర్లకు మాత్రం కేవలం 40% ఎరువునే సరఫరా చేస్తుండటంపై ఆవేదన చెందుతున్నారు. సబ్సిడీ రూపంలో యూరియా బస్తాపై రూ.1300 వరకు కేంద్రం భరించాల్సి వస్తోంది. కానీ బస్తా రూ.266.50 మాత్రమే పలుకుతుండటంతో కేంద్రం నానో యూరియాను ప్రోత్సహిస్తోంది. ఎకరానికి సరిపడా అర లీటర్ నానో యూరియా బాటిల్ రూ.225 మాత్రమే పలుకుతుండటంతో రైతులను ఈ దిశగా తీసుకెళ్లేందుకు డీలర్లకు లింకులు పెడుతోందనే వాదన ఉంది. పంటలు మొక్క దశలో ఉన్నప్పుడు నానో యూరియా, డిఏపి వినియోగించాలి.. దీనికి ముందు ఘన రూపంలో ఉన్న యూరియాను ఉపయోగించాలని కోరుతున్నా రైతులు నేలల్లో వేసే సంప్రదాయ రీతిలో ఎరువుల వినియోగానికే మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వం సగానికి సగం ఘన రూప యూరియా, డిఏపి ఎరువును తగ్గించాలని నిర్ణయించింది. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో సరఫరా చేయాల్సిన 3 లక్షల టన్నులకు 1.80 లక్షల టన్నులు మాత్రమే ఘన రూప ఎరువు సప్లరు చేశారు.

విక్రయాల నిలిపివేత దిశగా..

తమకు ఎదురవుతున్న ఇబ్బందులపై ఆందోళనలు ప్రయివేటు డీలర్లు చేపట్టాలని నిర్ణయిస్తున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో యూరియా, డిఏపి విక్రయాలను ఆ రాష్ట్ర డీలర్ల అసోసియేషన్ నిలిపివేసింది. రాష్ట్రంలోనూ ఈనెల 10లోగా మండల, జిల్లా స్థాయి డీలర్ల అభిప్రాయాలు సేకరించాలని స్టేట్ అసోసియేషన్ నిర్ణయించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 800 మంది వరకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లు ఉన్నారు. ఇప్పటికే మండల అసోసియేషన్లతో జిల్లా అసోసియేషన్ సమావేశాలు నిర్వహిస్తోంది. ఖమ్మం అర్బన్, తల్లాడ, చింతకాని, వైరా తదితర 8కి పైగా మండలాల్లో 10వ తేదీ నుంచి ఎరువు అమ్మకాలను నిలిపివేయాలని ఆయా అసోసియేషన్లు తీర్మానించాయి.

సబ్సిడీలో భాగంగా రవాణా భారాన్ని భరించాలి

పుల్లఖండం నాగేంద్రరావు, ఎరువుల డీలర్ల అసోసియేషన్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు

లింకు ఎరువుల పద్ధతిని విడనాడాలని కోరుతూ స్టేట్ డీలర్స్ అసోసియేషన్ అభిప్రాయాలు సేకరిస్తోంది. మండలాలు, జిల్లా వారీగా వచ్చిన ప్రతిస్పందనలను బట్టి ఎరువుల విక్రయాలు నిలిపివేయాలనే నిర్ణయం ఉంటుంది. ప్రస్తుతం ఉత్తర తెలంగాణలో ఎరువుల వినియోగం బాగా ఉంది. రాష్ట్రం మొత్తం ఎరువుల వాడకం పెరిగే లోగానే దీనిపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని డీలర్స్ అసోసియేషన్ భావిస్తోంది. దీనిలో మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి తీర్మానాలు చేస్తున్నారు. ఈ నెల 10వ తేదీ నాటికి ఓ స్పష్టత రాకపోతే స్టేట్ అసోసియేషన్ తీసుకునే నిర్ణయాన్ని బట్టి నిరసన కార్యక్రమాలు చేపడుతాం.

ఇరాన్‌పై అమెరికా యుద్ధోన్మాద దాడిని ఖండిస్తున్నాం

- సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇరాన్‌పై అమెరికా యుద్ధోన్మాద దాడిని ఖండిస్తున్నామని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇజ్రాయిల్‌కు మద్దతుగా మూడు అణుశుద్ధి , యురేనియం నిల్వ కేంద్రాలపై బాంబుల దాడి చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇది ఇరాన్ సార్వభౌమాధికారంపై దాడి అని తెలిపారు. దురాక్రమణ దేశానికి మద్దతుగా నేరుగా మద్దతు నిలిచిన చర్య అని పేర్కొన్నారు. చమురు నిల్వలపై పట్టు కోసం, పశ్చిమాసియాపై ఆధిపత్యం కోసం అమెరికా ఎన్నో ప్రత్యక్ష, పరోక్ష యుద్ధాలు చేస్తున్నదనీ, అక్కడి పాలకులను తనకు అనుకూలంగా మార్చుకుంటున్నదని వివరించారు. స్వతంత్రంగా వ్యవహరించే వారిని నిర్దాక్షిణ్యంగా హతమారుస్తున్నదని తెలిపారు. అలీన విధానాన్ని అనుసరించే మన దేశం కూడా ఇజ్రాయిల్ దారుణ మారణకాండకు మద్దతు తెలపడాన్ని తప్పుబట్టారు. భారత ప్రభుత్వం ఇజ్రాయిల్‌తో దౌత్యసంబంధాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు.

171 ఇంజనీరింగ్ కాలేజీల్లో 1,07,218 సీట్లు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 171 ఇంజినీరింగ్ కాలేజీల్లో 1, 07,218 సీట్లను టెక్నికల్ ఎడ్యూకేషన్ కమిషన్ ఏ.దేవసేన ప్రకటించారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.



అనుభవాల సారం ఓ మారు వెనక్కి వెళ్లి రావాలి

ప్రజాశక్తి కల్చరల్

జీవితంలో జ్ఞాపకాల దొంతరలుతో పాటు అంతర్దృష్టి ఉంటే కవి ఉత్తమ కవితలు రాగలరు అని ప్రఖ్యాత కవి నిఖిలేస్వర్ అన్నారు. దివాకరాచారి రచించిన 'ఓ మారు వెనక్కి వెళ్లి రావాలి' కవితా సంపుటిని ఆయన అనుభవాల సారం ధ్యోతకం అవుతుందని చెప్పారు. రవీంద్ర భారతి సమావేశ మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో డాక్టర్ దివాకరాచారి రచించిన 'ఓ మారు వెనక్కి వెళ్లి రావాలి' కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నిఖిలేశ్వర్ సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు ఎనభై కవితల సమాహారంలో వస్తు విస్తృతి విభిన్న ఇతివృత్తాలు ఉన్నాయి అన్నారు వర్తమాన కాలంలో సంక్షుబిత స్థితికి కవి ప్రతిస్పందన కూడా ఉన్నాయి అన్నారు అధ్యక్షత వహించిన ప్రముఖ రచయిత నందిని సిద్ద రెడ్డి మాట్లాడుతూ దివాకరాచారీ కవితల నేపథ్యం సామాజిక మైనది అన్నారు కవి యాకుబ్ మాట్లాడుతూ గాజా ధ్ఞుఖ సంఘటనలు నుంచి మన దేశం లో రైతు కష్టాల వరకు కవితలు లో ఉన్నాయని ఉదాహరించారు. మత మౌఢ్యం శక్తులను నిరసిస్తూ చైతన్యం కలిగించే కవితలు వున్నాయని చెప్పారు. వేదిక పై వీక్షణం సంపాదకుడు ఎన్ వేణుగోపాల్ విమర్శకులు జ్యోతి డాక్టర్ శంకరం తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నుంచి ఏకాణా తేలేని వారు లేఖలు రాయడమా?

- వాగ్దానాలతో ఊదరగొట్టడం... విద్వేషాన్ని రెచ్చగొట్టడమే మీ పార్టీ పని
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఏకాణా తేలేని వారు కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖలు రాయడమా? అంటూ బిజెపి అధ్యక్షులు ఎన్.రామచందర్‌రావుపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం కౌంటర్ లేఖ రాశారు. ప్రధాని మోడీ సర్కార్ వైఫల్యాల సంగతేంటని ప్రశ్నించారు. "పదకొండేండ్ల క్రితం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ దేశ ప్రజలను అడుగడుగునా వంచించింది. గత మూడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజల ఆశలపై ప్రధాని నీళ్లు చల్లారు. వాగ్ధానాలతో ఊదరగొట్టడం, విద్వేషాన్ని రెచ్చగొట్టడం, అబద్ధాలను ఆవిష్కరించడం తప్ప మీరు చేసిందేమీ లేదు. రైతులు, యువకులు, మహిళలు, పేదలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ.. ఇలా అన్ని వర్గాలను వంచించిన చరిత్ర మీది" అలాంటి మీరు ముఖ్యమంత్రికి లేఖలు రాయడం విడ్డూరంగా ఉందని పొన్నం లేఖలో ఆరోపించారు. మీరు రాసిన లేఖ గురువింద గింజ సామెతను గుర్తు తెస్తోందని ఎద్దేవా చేశారు. పదకొండేండ్లలో తెలంగాణకు ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపిలు, ఇద్దరు కేంద్రమంత్రులు ఏం చేస్తున్నారని నిలదీశారు. 2019 పార్లమెంట్ ఎన్నికల మెనిఫెస్టోలో వాగ్దానాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 60 ఏళ్లు దాటిన సన్నకారు రైతులకు పించన్లు, కిసాన్ సమ్మాన్ నిధి పెంపు తదితర ఒక్క హామీ అమలు కాలేదని గుర్తు చేశారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా ఇవ్వకుండా మోసం చేశారనీ, కృష్ణా జలాల్లో నీటి వాట తెల్చకుండా నాన్చుతుంది మీరు కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలను వంచించి.. ఒట్టి లేఖలు రాస్తే ప్రయోజనం లేదన్నారు. చేతనైతే ప్రధాని మోడీకి లేఖ రాసి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

పనిగంటల పెంపు జిఓను రద్దు చేయాలి

- కార్మికులను కట్టుబానిసలుగా మార్చేందుకు జిఒ 282
- జిల్లా, మండల, పారిశ్రామిక కేంద్రాల్లో జిఒ కాపీల దహనం
- ఉమ్మడి సమావేశంలో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ దుకాణాలు, స్థాపనల చట్టం-1988లోని సెక్షన్ 16,17కి సవరణ చేస్తూ పనిదినాన్ని ఎనిమిది గంటల నుంచి పది గంటలకు పెంచుతూ విడుదల చేసిన జీవో నెంబర్ 282ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని కార్మిక సంఘాల నేతలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఆ జీవోతో కార్మికులు మరింత శ్రమదోపిడీకి గురై కట్టుబానిసలుగా మారే ప్రమాదముందని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం జిల్లా, మండల కేంద్రాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో జీవో కాపీలను దహనం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అదే సమయంలో హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కార్యాలయం(అంజయ్య భవన్) ఎదుట జీవో కాపీల దహనం, నిరసన కార్యక్రమాలుంటాయని ప్రకటించారు. వీటిని కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లో సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం జరిగింది. అందులో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కె.సూర్యం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు విఎస్ బోస్, టిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారన్న, ఎఐటియుసి రాష్ట్ర ఇన్‌చార్జి భరత్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఓవైపు దేశవ్యాప్తంగా మోడీ సర్కారు తీసుకురాబోతున్న లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుంటే ఇక్కడేమో కాంగ్రెస్ ప్రభుత్వం పది గంటల పనివిధానాన్ని చట్టబద్ధం చేస్తూ జీవో జారీ చేయడం దుర్మార్గమన్నారు. ఆ జీవో పెట్టుబడిదారులు, కార్పోరేట్ల సంస్థల ప్రయోజనాలు, లాభాల కోసమే స్పష్టం చేశారు. ఈ జీవో వల్ల కార్మికులకు ఎలా ప్రయోజనం చేకూరదని నొక్కి చెప్పారు. జులై 9న దేశవ్యాప్త సమ్మెకు సన్నద్ధమవుతున్న తరుణంలో కార్మికులను మరింత రెచ్చగొట్టేలా కాంగ్రెస్ సర్కారు నిర్ణయం విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని కార్మికవర్గం ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

సిగాచి యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి

- క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం వెంటనే ఇవ్వాలి
- పరిశ్రమ వద్ద కార్మిక సంఘాల నినాదాలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిగాచి పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టి వెంటనే అరెస్టు చేయాలని, మృతిచెందిన కార్మిక కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, టిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు బోస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనపై జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు ఆదివారం బాధిత కుటుంబాలను పరామర్శించి, ఘటనా స్థలాన్ని సందర్శించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి, పరిశ్రమ యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దాంతో అనుమతించి వారిని ప్రమాద ఘటనా స్థలానికి తీసుకెళ్లారు. అక్కడ ఉన్న జిల్లా ఎస్పి పరితోస్ పంకాజ్‌తో వారు మాట్లాడారు. మృతి చెందిన, ఆచూకీ దొరకని వారి వివరాల గురించి ఎస్పీ వారికి వివరించారు. అందరికీ న్యాయం జరిగే విధంగా చూస్తామని నాయకులతో అన్నారు. ఈ సందర్భంగా జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు పాలడుగు భాస్కర్, బాలరాజు, శ్రీనివాస్, సూర్యం, బోస్ మాట్లాడారు. పరిశ్రమలో ప్రమాదం జరిగి ఇంత పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగిన ఘటన దేశాన్నే కుదిపేసిందని, ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. ఇప్పటి వరకు 42 మంది కార్మికులు మృతి చెందారని, మరో 8 మంది ఆచూకీ దొరకలేదని తెలిపారు. కార్మికుల భద్రత పట్ల పరిశ్రమ యాజమాన్యాల నిర్లక్ష్యమే ఇలాంటి ప్రమాదాలకు కారణమవుతున్నాయని అన్నారు. యాజమాన్యాల లాభాపేక్ష కోసం పరిశ్రమలు ఇష్టానుసారంగా చట్టాలకు విరుద్ధంగా నడుపుతున్నారన్నారు. ఎక్స్‌పైర్ అయిన యంత్రాలు, అనుభవం లేని కార్మికులను ప్రొడక్షన్‌లో వినియోగిస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమలను తనిఖీ చేయకుండా యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాల్లో మార్పులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిగాచి ప్రమాద ఘటనకు యాజమాన్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని స్పష్టంచేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు యాజమాన్యం ప్రకటించిన కోటి రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు, కేంద్ర ప్రభుత్వం రూ. 50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 లక్షలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు రమ, కార్యదర్శి ఉప్పల శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు కె రాజయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్, పాండు, రంగారెడ్డి, బి నాగేశ్వరరావు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు పాల్గొన్నారు.

టీచర్లతో స్కూళ్ల తనిఖీ సరికాదు

- ఎంఇఒ పోస్టులను భర్తీ చేయాలి : తపస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టీచర్లతో స్కూళ్ల తనిఖీ సరిగాదనీ, దాని కోసం రెండు వేల మంది ప్రాథమిక పాఠశాలల్లోని ఎస్జీటీలు, హెచ్ఎంలు, యుపిఎస్, హైస్కూళ్లకు చెందిన స్కూల్ అసిస్టెంట్లకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలు అప్పగించడం సరిగాదని తపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరావు, నవాత్ సురేశ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి జిల్లాలో రెండు శాతం టీచర్లను తనిఖీ అధికారులుగా ప్రత్యేకంగా నియమిస్తే విద్యావ్యవస్థ కుంటుపడుతుందనీ, విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన పాఠశాలల, ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ చేసి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ఉన్నత పాఠశాలలో ప్రతి సబ్జెక్టు ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా ఏర్పాటు చేయాలనీ, కొంత సమయమిచ్చి గతంలో మాదిరిగా ప్యానెల్ తనిఖీలు చేస్తే బాగుంటుందని సూచించారు.

కార్మికులకు మరణశాసనం లేబర్‌కోడ్లు

- సమ్మె పిలుపును ఖాతరు చేయని పాలకులు
- కార్మిక వర్గానికి ఇది సవాల్
- లాభాపేక్షే కార్పొరేట్లకు పరమావధి : ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లతో కార్మిక వర్గానికి మరణ శాసనం రాయనుందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య విమర్శించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎస్వీకే ట్రస్ట్ కార్యదర్శి ఎస్ వినయకుమార్ అధ్యక్షతన 'జూలై 9న సార్వత్రిక సమ్మె ఎందుకు?' అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌ల పర్యవాసనంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలో పది గంటల పని విధానాన్ని అమలు చేస్తూ జీవో విడుదల చేశారని గుర్తు చేశారు. అదే జీవోలో 12గంటల వరకు పనిచేయించవచ్చని పేర్కొన్నట్టు తెలిపారు. దేశంలో అనేక రాష్ట్రాలు ఇలాంటి జీవోలు ఇచ్చే అవకాశం లేకపోలేదన్నారు. ఇప్పటికే అదనపు గంటలు పని చేయించుకుంటున్న యజమాన్యాలకు ఇది మంచి అవకాశంగా తీసుకుంటారని ఆందోళన వ్యక్తం చేశారు. సమ్మెకు మూడు రోజుల ముందు ఇలాంటి జీవోను విడుదల చేయటమంటే..పుండుమీద కారం చల్లటం కాక మరేమిటని ప్రశ్నించారు. పాలకులు సమ్మె పిలుపును ఖాతరు చేయటం లేదని చెప్పారు. భారత కార్మిక వర్గానికి ఇదోక సవాలన్నారు. కార్మిక సంఘాల నాయకత్వంతో చర్చించి ఆ సమస్యల పరిస్కారానికి పూనుకోకుండా కార్మికులను రెచ్చగొట్టటం సరికాదని హితవు పలికారు. రాష్ట్రంలో జీవో వచ్చిందో..రాలేదో..వెంటనే విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్ల రోజువారి హాజరుపట్టికను ఉన్నతాధికారులకు చూపించాలని హుకూం జారీ చేసి సమ్మెలో పాల్గొనకుండా బెదిరిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థల్లోనే ఇలా ఉంటే..ఇక ప్రయివేట్ రంగంలోని పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చన్నారు. బరితెగించిన పాలక వర్గాల స్థితిని చూస్తుంటే.. తొమ్మిదిన జరిగబోయే సార్వత్రిక సమ్మెకు ప్రాధాన్యత ఉందన్నారు. కార్మికులకు కష్టమైతంది కాబట్టే నాలుగు లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చినట్టు మోడీ అబద్దాలు చెబుతున్నారని వివరించారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం, విదేశీ పెట్టుబడిదారులను సంతృప్తి పరిచేందుకే వాటిని తీసుకొచ్చారని స్పష్టం చేశారు. కానీ..మోడీ మాత్రం కార్మికుల ప్రయోజనాల కోసమంటూ..చెవుల్లో పూలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్మికులు మోసపోయేందుకు సిద్దంగా లేరనీ, అందుకే సమ్మెకు సన్నద్ధమవుతున్నారని చెప్పారు. పాల చట్టాల్లో అనేక లోపాలున్నప్పటికీ ఎంతో కొంత కార్మిక వర్గానికి ఉపయోగపడ్డాయన్నారు. కోరలు లేని లేబర్ కోడ్‌లను చూపించి కార్మిక వర్గాన్ని మభ్యపెట్టటం సాధ్యమా? అని ప్రశ్నించారు. లేబర్‌కోడ్‌ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టినప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు పలికాయని గుర్తు చేశారు. పార్టీలు వేరైనా పారిశ్రామిక వేత్తల సేవలో తరించటంలో ఒకే తాను ముక్కలని విమర్శించారు. కుర్చీల కొట్లాట తప్పితే..కార్మికులను అణచేయటంలో ఒకే విధానాన్ని అనుసరిస్తున్నారని చెప్పారు. కార్మికులను కట్టుబానిసలుగా మార్చే విధానాలకు నిరసనగానే సమ్మె జరుగుతుందని చెప్పారు. కార్మిక వర్గం పాలక వర్గాల బెదిరింపులకు లొంగదనీ, వారు ఒంటరి వారు కాదనీ, ఎర్రజెండా అండగా ఉందని చెప్పారు.

అపోహాలను నమ్మొద్దు

- హాని కలిగించే చెట్ల తొలగింపు
- సిఎం పర్యటన కోసం భూమి చదును
- నేడు ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో వనమహోత్సవం : జానయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వాతావరణానికి హాని కలిగించే చెట్లను నెల రోజులుగా యూనివర్సిటీలో తొలగిస్తున్నామని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఉపకులపతి జానయ్య తెలిపారు. నేడు యూనివర్సిటీలో నిర్వహించే వన మహోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని, అందుకే ఆ ప్రాంతంలో ఉన్న భూమిని చెదను చేశామన్నారు. ఆదివారం యూనివర్సిటీ బొటానికల్ గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో విసి మాట్లాడారు. ముఖ్యమంత్రి పర్యటన ఒకరోజు ముందుగా యూనివర్సిటీకి సమాచారం అందించడంతో రాత్రి సమయంలో చెట్ల తొలగింపు, భూమి చదును పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. అయితే యూనివర్సిటీలోని విద్యార్థులు బొటానికల్ గార్డెన్‌లో రాత్రి సమయంలో జెసిబిల సాయంతో పనులు చేస్తుండటంతో విద్యార్థులకు తెలియక చెట్లను తొలగిస్తున్నారని అడ్డుకున్నారని తెలిపారు. తర్వాత యూనివర్సిటీ అధికారులు, విద్యార్థులతో చర్చించి అక్కడ వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పడంతో సమస్య పరిష్కారమైందని చెప్పారు. అయితే విశ్వవిద్యాలయంలో జరిగే ఈ వనమహోత్సవం కార్యక్రమంపై కొందరు అసత్య ప్రసారాలను సోషల్ మీడియా ద్వారా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అసత్య ప్రచారాలను ప్రజల నమ్మొద్దని సూచించారు. ఒకప్పుడు ఎంతో వైభవంగా ఉన్న ఈ బొటానికల్ గార్డెన్ 15 ఏళ్లుగా నిరుపయోగంగా ఉందని, మళ్లీ ఇప్పుడు పూర్వ వైభవం తీసుకొచ్చే దశగా పనులు జరుగుతున్నాయని వివరించారు. రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ వనమోత్సవ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నారని తెలిపారు. వాతావరణానికి ముప్పు కలిగించే సుబాబుల్, యూకలిప్టస్ లాంటి అప్రయోజన చెట్లను తొలగించి, వాటి స్థానంలో తెలంగాణలో ఉన్న అరుదైన అటవీ జాతి మొక్కలను, సంప్రదాయ అటవీ జాతి పండ్ల మొక్కలను పెద్ద ఎత్తున క్యాంపస్‌లో పెంచే కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెప్పారు. హెచ్ఎండిఏ దత్తత తీసుకొని పచ్చదనాన్ని పెంపొందించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇందులో భాగంగానే వనమోత్సవ కార్యక్రమాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. తెలంగాణ అటవీ ప్రాంతంలో అరుదుగా లభించే అటవీ మొక్కలు నాటే కార్యక్రమానికి నేడు శ్రీకారం చుట్టనున్నట్టు వివరించారు. నేడు జరిగే ముఖ్యమంత్రి పర్యటనను యూనివర్సిటీ అధికారులు, విద్యార్థులతో కలిసి విజయవంతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జానయ్య

జీవితమంతా సమరం చేసిన రావూరి భరద్వాజ

ప్రజాశక్తి కల్చరల్



జీవితం అంతా దారిద్ర్యంతో సమరం చేస్తూ అత్యుత్తమ జ్ఞాన పీఠం స్థాయికి ఎదిగారని తెలంగాణ సారస్వత పరిషత్తు కార్యదర్శి డాక్టర్ జె చెన్నయ్య అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా దీక్షితులు కళా వేదిక పై జి వి ఆర్ కల్చరల్ ఫౌండేషన్ నిర్వహణలో ప్రఖ్యాత రచయిత రావూరి భరద్వాజ జయంతి సందర్భంగా ప్రముఖ సాహితీ వేత్త బండి నారాయణ స్వామి కి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారం రచయిత్రి కన్నెగంటి అనసూయకు రావూరి కాంతమ్మ స్మారక సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. డాక్టర్ చెన్నయ్యతో ముఖ్య అతిథిగా పాల్గొన్న వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు రావూరి భరద్వాజ కుమారుడు వెంకట కోటేశ్వర రావుతో కలసి పురస్కారాలు బహుకరించి మాట్లాడారు. బండి నారాయణ స్వామి రాయల సీమ మాండలికంలో రాసిన కథలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారని అనసూయ బాలల కథా రచయిత్రిగా ఐదు దశాబ్దాల సాహిత్య ప్రస్తానం సాగించారు అని వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వంశీ రామరాజు మాట్లాడుతూ రావూరి భరద్వాజ తెలుగు సాహిత్య శిఖరం అన్నారు జీవితంలో కష్టాలను అధిగమిస్తూ సాహితీ సేద్యం చేసారని గుర్తు చేశారు. అవార్డ్స్ అందుకున్న ఇరువురూ తెలుగు సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపు పొందారని చెప్పారు. కవి పెద్దూరి వెంకట దాసు సభా నిర్వహణ చేసిన కార్యక్రమానికి వెంకట రెడ్డి స్వాగతం పలకగా కార్యదర్శి రాఘవ రెడ్డి వందన సమర్పణ చేశారు. సాహితీ అభిమాని మాధురి అభినందన తెలిపారు.

నిస్వార్థ సేవకు డాక్టర్లు ప్రతీక

- సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిస్వార్థ సేవలకు డాక్టర్లు ప్రతీక అని సెంట్రల్ బ్యాంక్ జోనల్ మేనేజన్ ఆర్. రాజేంద్ర ప్రసాద్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వారం రోజులపాటు జరగనున్న ఈ వేడుకల్లో భాగంగా హైదరాబాద్ జోన్ జోనల్ హెడ్ కె. ధరాసింగ్ నాయక్ ఆధ్వర్యంలో జోన్ పరిధిలోని ఏడుగురు ప్రాంతీయ అధిపతులు, వివిధ ఆస్పత్రులను సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలోని వైద్యులకు వారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయా ఆస్పత్రుల్లో వైద్యులను సత్కరించారు. వారి నిస్వార్థ సేవ, ప్రజారోగ్యం పట్ల వారికి ఉన్న అచంచల నిబద్ధతకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మాటికి శ్రమ దోపిడే..

- కార్మికుల కడుపుగొట్టి కార్పొరేట్లు మేసే కుట్ర
- 9న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి
- మోడీ విధానాలను అవలంబిస్తున్న రేవంత్ సర్కార్ : జాన్ వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 10 గంటల పని దినాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తూ జీ.ఓ విడుదల చేయడం కార్మిక చట్టాలను కాలరాయడమేనని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసి, వారి శ్రమను కార్పొరేట్లకు దోచిపెడుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఈ నెల 9న జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం ఎల్బీ నగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని హస్తినాపురం డివిజన్ నందనవనంలో మున్సిపల్ కార్మికులతో కలిసి జాన్‌వెస్లీ జిఒ 282 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎల్బీ నగర్ సర్కిల్ కమిటీ అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తొమ్మిదిన దేశ వ్యాప్త సమ్మెకు సిపిఎం మద్దతు ప్రకటిస్తున్నదని తెలిపారు. మే డే స్ఫూర్తితో కార్మిక, కర్షక లోకం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాలను కాకుండా గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో అమలు పరుస్తున్న పది గంటల పని దినాలను తెలంగాణలోనూ అమలు పరుస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీ.ఓ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చీకటి ఒప్పందాలకు నిదర్శనమని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ కార్మికులకు ఏడాదికి కనీసం 200 పనిదినాలు కల్పించాలన్నారు. రోజుకు రూ.600 కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు పదేండ్లుగా పనిచేస్తున్నప్పటికీ వారిని రెగ్యులరైజ్ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వేతనాలు కూడా చెల్లించకపోవడం దారుణమన్నారు. సిపిఎం ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తున్నదని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.చంద్రమోహన్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి, సరూర్ నగర్ సర్కిల్ కార్యదర్శి సిహెచ్ వెంకన్న, సిఐటియు రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఎం వీరయ్య, సిపిఎం నందనవనం, వనస్థలిపురం, చంపాపేట శాఖల కార్యదర్శులు మంథని యాదయ్య, పి. రామస్వామి, దుర్గారావు, ఆర్టీసీ యూనియన్ రాష్ట్ర నాయకులు రవీందర్ రెడ్డి, సర్కిల్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ కార్మికులతో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

వేలానికి మరిన్ని భూములు

- తెలంగాణ హౌసింగ్ బోర్డు నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలోని మరిన్ని భూములను వేలం వేయాలని తెలంగాణ హౌసింగ్ బోర్డు నిర్ణయం తీసుకుంది. కేపీహెచ్‌బీ, హైటెక్ సిటీ కారిడార్‌లో భూములను ప్లాట్లుగా మార్చి విక్రయించను న్నట్లు ఆ సంస్థ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. బహుళజాతి సంస్థలు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు, హాస్పిటాలిటీ గ్రూపులు, పెట్టుబడిదారుల నుంచి వస్తున్న భారీ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని హైటెక్ సిటీ కారిడార్‌కు అనుకుని ఉన్న సుమారు 7.3 ఎకరాల్లోని భూమిని ప్లాట్లుగా మార్చి వేలం వేయనున్నట్లు తెలిపింది. ఈ స్థలాలు ప్రధాన వ్యాపారాలు, ఐటీ పార్కులు, అంతర్జాతీయ పాఠశాలలు, ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ, రాబోయే మెట్రో సౌకర్యాలకు దగ్గరగా ఉందని ఆ సంస్థ తెలిపింది. వాణిజ్యానికి ఉపయోగించుకునేలా కెపిహెచ్‌బిలో ఒక్క ప్లాట్ 4598 చదరపు గజాలు, మరో ప్లాటు 2420 చదరపు గజాలు చొప్పున వేలానికి సిద్ధంగా ఉన్నాయి. నాంపల్లిలోనూ 1148.30 చదరపు అడుగుల వాణిజ్య ప్లాట్‌ను విక్రయించనున్నట్లు వెల్లడించింది. ఆసక్తిగల పార్టీల కోసం ప్రీ-వేలం నిర్వహించడంతోపాటు ఆస్తుల సందర్శనలు ఏర్పాటు చేస్తున్నామని తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ విపి గౌతం తెలిపారు. తుది వేలాన్ని జులై 30న నిర్వహించనున్నామన్నారు. మరింత సమాచారం కోసం తమ పోర్టల్‌ను సంప్రదించవచ్చన్నారు.

ఏకలవ్య భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి : కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏకలవ్య భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జాగృతి అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం, ఎరుకల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్‌పై కొమురం భీం విగ్రహం వద్ద ఏకలవ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏకలవ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని చేవెళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్‌కి రూ. 500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎరుకల కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి వారి సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం చేయాలని కోరారు. త్వరలోనే ఏకలవ్య భవనాన్ని పూర్తి చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూతాడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయాలి

- పెన్షనర్ల బకాయిలు విడుదల చేయాలి
- 9న దేశవ్యాప్త సమ్మెకు మద్దతు : టిఎస్‌యుటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయాలనీ, పెన్షనర్లకు బకాయిలు విడుదల చేయాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ.వెంకటేశ్ కోరారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల తొమ్మిదిన దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిఆర్‌సి అమలు గడువు దాటి రెండేండ్లు గడిచిన నేపథ్యంలో పిఆర్‌సి నివేదిక తెప్పించుకుని 1.07.23 నుంచి అమలు చేయాలని విన్నవించారు. 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఉద్యోగ విరమణ అనంతర ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పోరాటాలకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రతినెల రూ 700 కోట్ల బకాయిలు విడుదల చేయాలని నిర్ణయించారనీ, కానీ, ఇప్పటి వరకూ కేవలం రూ.180 కోట్లు మాత్రమే విడుదల చేశారని తెలిపారు. వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. గురుకులాల పనివేళలను శాస్త్రీయంగా సవరించాలనీ, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలివ్వాలని విన్నవించారు. కెజిబివి, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలనీ, డిఇఒ, డిప్యూటీ ఇఒ, ఎంఈఓ, డైట్ లెక్చరర్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల పర్యవేక్షణ సంబంధిత అధికారుల ద్వారానే జరపాలని కోరారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఇంకా పూర్తి చేయకపోవడం విచారకరమన్నారు. తక్షణమే బదిలీ, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలనీ, సిపిఎస్ రద్దు చేసి 2003 డిఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గిందనీ, ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో విశ్వాసం కలిగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని నొక్కి చెప్పారు. ఊరి బడిని కాపాడుకోవాల్సిన అవసరం సమాజానికి ఉందన్నారు. ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలనీ, ఉన్నత పాఠశాలల్లో 11,12 తరగతులను ప్రారంభించాలనే ప్రతిపాదనను స్వాగతిస్తున్నామని చెప్పారు. అయితే, పాఠశాలల్లో అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించిన తర్వాతే 11,12 తరగతులను ప్రారంభించాలని కోరారు. ఇంటర్ విద్యలో బలంగా వేళ్ళూనుకున్న కార్పోరేట్ విద్యా వ్యాపారాన్ని పాఠశాల విద్యలో ప్రవేశించకుండా అడ్డుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆగస్టు 8,9,10 తేదీల్లో కోల్‌కతాలో జరిగే స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రజతోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ఆగస్టు 1 నుండి వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ఎన్ఇపి, సిపిఎస్ లకు వ్యతిరేకంగా సదస్సులు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు సిహెచ్ దుర్గాభవాని, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు రాములు, రాజశేఖరరెడ్డి, శాంతకుమారి, నాగమణి, రంజిత్ కుమార్, రాజు, మల్లారెడ్డి, శ్రీధర్, రవికుమార్, రవిప్రసాద్‌గౌడ్, జ్ఞాన మంజరి, సింహాచలం, వెంకటప్ప, యాకయ్య, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లి, కల్వకుర్తి మోటార్లను నడపండి

- లేదంటే రైతులతో కలిసి మేమే ఆన్‌చేస్తాం
- ప్రభుత్వానికి మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కన్నెపల్లి, కల్వకుర్తి వద్ద మోటార్లను వెంటనే నడపాలనీ, లేదంటే రైతులతో కలిసి తామే వాటిని ఆన్ చేస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేసేందుకే నీటిని ఎత్తిపోయడం లేదని ఆరోపించారు. నీటి విలువ తెలియని నేతలు పాలన సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ పార్టీపై కోపంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందికి గురి చేస్తోందని విమర్శించారు. మేడిగడ్డ నుంచి 73,600 క్యూసెక్కుల ప్రవాహం ఉన్నా ఎందుకు నీటిని ఎత్తి పోయడం లేదని ప్రశ్నించారు. మోటార్లు ఆన్ చేస్తే 15 జిల్లాలకు సాగునీరందుతుందని అన్నారు ఎస్సారెస్పీ కింద పంటలు వేసేందుకు రైతులు ఎదురు చూస్తూన్నారని గుర్తు చేశారు. "శ్రీశైలానికి వరద వచ్చి 36 రోజులైనా కల్వకుర్తి మోటార్లు ఆన్ చేయలేదు. రెండు రోజుల్లో శ్రీశైలం గేట్లు ఎత్తే అవకాశం ఉంది. వెంటనే ఆన్ చేస్తారో.. లేదో ప్రభుత్వం ప్రకటించాలి. ఉత్తర తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే సాగు, తాగునీటి ఇబ్బంది వచ్చే అవకాశం ఉంది. వెంటనే కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లు ఆన్ చేయాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీని ఎందుకు మరమ్మతులు చేయలేదో చెప్పాలని నిలదీశారు. పోలవరంలో డయాఫ్రంవాల్ కొట్టుకుపోతే అక్కడికి ఎన్‌డిఎస్ఎ ఎందుకు పోలేదు? ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ కుప్పకూలిపోతే ఎందుకు రాలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కేంద్రం సమర్థిస్తోందని హరీశ్ ఆరోపించారు.

అమాయక ప్రజల జోలికొస్తే ఊరుకోబోం

- పేదలు నివసిస్తున్న ప్రాంతంలోనే ఇందిరమ్మ ఇల్లు కట్టివ్వాలి : జగదీష్
- బసవతారకనగర్ గుడిసె వాసుల పోరాటానికి మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని బసవతారక నగర్‌లో పేదల గుడిసెలను కూల్చివేసిన ప్రదేశాన్ని సిపిఐ(ఎం) నాయకులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం బృందానికి గుడిసెవాసులు తమ గోడును వెల్లబోసుకున్నారు. 30 ఏళ్లుగా ఇక్కడే నివసిస్తున్నామని, కొంతమంది ప్రయివేట్ వ్యక్తులు వచ్చి తమ గుడిసెలను కూల్చివేశారని మొరపెట్టుకున్నారు. అనంతరం సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగదీశ్ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ బసవతారక్‌నగర్‌లో 30 ఏండ్లుగా ప్రభుత్వ స్థలంలో 500 కుటుంబాలు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. ఇక్కడ ఉంటున్న పేద అమాయక ప్రజలను వెళ్లగొట్టేందుకు కొద్ది రోజులుగా ప్రయివేట్ వ్యక్తులు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండతో వారి మద్దతుదారులు అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ తక్షణమే ఈ ప్రదేశాన్ని ఖాళీ చేయాలని, లేకుంటే తీవ్ర చర్యలు ఉంటాయని అమాయక ప్రజలను భయపెట్టిస్తున్నారని తెలిపారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్ విభాగాలు ఇప్పటివరకు స్పందించకపోవడం శోచనీయమన్నారు. తమకున్న సమాచారం మేరకు స్థానిక ప్రజాప్రతినిధి, బడా రియల్ ఎస్టేట్ వ్యాపారులతో సంబంధాలు పెట్టుకుని, పేద ప్రజలపై తన ప్రతాపాన్ని చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఈ చర్యలను మానుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజల గుడిసెల పోరాటానికి తమ పార్టీ మద్దతును ప్రకటించారు. వీరికి ఆ ప్రాంతంలోనే ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు ప్రకాష్ కారత్, స్థానిక పార్టీ నాయకులు కొంగరి కృష్ణ, జంగయ్య, శివన్న తదితరులు పాల్గొన్నారు.

పేలుడు పదార్థాల నిల్వ కేసులో గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి అరెస్టు?

- పరారీలో సోదరుడు గడ్డం సూర్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండు రోజుల కిందట కామారెడ్డి పట్టణంలోని కెపిఆర్ కాలనీలో పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలు జిలిటిన్ స్టిక్స్, ఇతర సన్నాహక సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిని పోలీసులు విచారించగా ఈ పేలుడు పదార్థాలను గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి వద్ద నుంచి తెచ్చుకున్నట్టు విచారణలో వెల్లడించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని శనివారం రాత్రి 11 గంటల సమయంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో తన నివాసంలో పోలీసులు అరెస్ట్ చేసి బిచ్కుందకు తరలించినట్టు సమాచారం. అక్కడి నుంచి నిజామాబాద్ జైలుకు తరలించినట్టు తెలుస్తోంది. కాగా, చంద్రశేఖర్ రెడ్డి సోదరుడు గడ్డం సూర్య పరారీలో ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్టు



పట్టణ ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. దాంతో ఈ ఘటన జిల్లా రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. జిలిటిన్ స్టిక్స్ సామగ్రి శ్రీవారి వెంచర్‌లో నిల్వ ఉండటంతో గడ్డం సోదరులకు సంబంధం ఉందని పోలీసులు అనుమానించినట్టు తెలుస్తోంది. అలాగే నిందితులు సైతం గడ్డం సోదరుల పేర్లు చెప్పడంతో పోలీసులు చంద్రశేఖర్ రెడ్డిని అరెస్టు చేసినట్టు తెలిసింది. మొదటగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్‌రాగా అతను వెళ్ళాడని.. ఆ తర్వాత అతని ఫోన్ రెండు గంటలసేపు స్విచ్ ఆఫ్‌లో ఉండి రాత్రి 12 గంటల తర్వాత అతడిని అరెస్టు చేసినట్టు పోలీసులు వారి కుటుంబ సభ్యులకు తెలిపినట్టు సమాచారం.

చంద్రశేఖర్ రెడ్డికి సంబంధం లేదు - మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

తన భర్త టిపిసిసి ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టి అక్రమ అరెస్ట్ చేశారని కామారెడ్డి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం కామారెడ్డిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తాము రాజకీయంగా ఎదుగుతున్న తీరును భరించలేని కొందరు తమపై తప్పుడు కేసులు బనాయించాలని చూస్తున్నారన్నారు. తన భర్త ఎలాంటి తప్పు చేయలేదని, పేలుడు పదార్థాల నిల్వ కేసులో అతనికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. అర్ధరాత్రి 12 గంటలకు పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి సిఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ అండగా ఉన్నారన్నారు. శ్రీవారి వెంచర్‌ను విబుస్ వెంచర్స్ వారికి 2023 లోనే అప్పజెప్పామని, తన భర్తకు ఆ వెంచర్‌తో ప్రస్తుతం ఎలాంటి సంబంధం లేదని, ఒక్క గుంట భూమి కూడా తన భర్త పేరు మీద లేదని తెలిపారు. తమను అరెస్టు చేయడానికి నిజంగా పోలీసుల వద్ద ఏదైనా సమాచారం, సాక్ష్యం ఉంటే తమకు నోటీసులిచ్చి అరెస్టు చేసి ఉంటే తాము ఎవరినీ తప్పు బట్టే వారిమి కాదని, కావాలనే తమను ఈ కేసులో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశారు.

పనిగంటల పెంపు జిఒను ఉపసంహరించుకోవాలి : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 10 గంటల పనివిధానానికి ఆమోదం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 282ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటరమేశ్, అనగంటి వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. లేబర్‌కోడ్‌లతో మోడీ సర్కారు కార్మికుల హక్కుల కాలరాసే ప్రయత్నం చేస్తున్న క్రమంలో దానికి సపోర్టు చేస్తూ రాష్ట్ర సర్కారు కూడా పనిగంటలను పెంచడాన్ని తప్పుబట్టారు. కార్మికుల శ్రమను దోపిడీ చేసి కార్పొరేట్లకు మేలు చేసేవిధంగా రాష్ట్ర సర్కారు నిర్ణయం ఉందని విమర్శించారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు వేరైనా పాలక వర్గాల విధానాలు ఒక్కటేనని మరోమారు రుజువైందని తెలిపారు. ఇప్పటి వరకు 24 గంటలు పనిచేసే సంస్థల్లో మూడు షిఫ్టుల పనివిధానం అమల్లో ఉందనీ, ఇప్పుడు కంపెనీలు ఆ విధానానికి స్వస్తి చెప్పి, అవే వేతనాలతో రెండు షిఫ్టుల్లో పని చేయించుకుంటాయని పేర్కొన్నారు. ఈ విధానం వల్ల పరిశ్రమల్లో ఒక షిఫ్ట్ కార్మికులకు పని లేకుండా పోతుందనీ, దీంతో దేశంలో నిరుద్యోగం పెరుగుతుందని ఆందోళన వెలిబుచ్చారు. బిజెపి విధానాలపై పోరాడుతున్నామని గొప్పలు చెప్పే రాష్ట్ర సర్కారు.. రాష్ట్రంలో వాటినే అమలు చేయాలని చూడటం దుర్మార్గమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పని గంటల పెంపు జీవో 282ను ఉపసంహరించుకుని కార్మికుల హక్కులను కాపాడాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాల్లో కాంగ్రెస్ నేతలు కలిసి రావాలని కోరారు.



వివరాలు తెలుపుతున్న ఎస్‌పి శరత్ చంద్రపవార్

దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు మైనర్లు

- రెండు కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్‌పి శరత్ చంద్రపవార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చెడు వ్యసనాలకు అలవాటు పడి, సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో గంజాయి విక్రయించడంతో పాటు రాత్రి సమయంలో తాళం వేసి ఉన్న ఇండ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న మైనర్ బాలురు, ఒక నిందితుడు, వారికి సహకరిస్తున్న ఒక మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 17 తులాల బంగారం, 79 తులాల వెండి, 2 కిలోల గంజాయితో పాటు పల్సర్ ఎన్ఎస్ -200 బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం నెమ్మాని గ్రామంలోని రిటైర్డ్ ఐఎఫ్ఎస్ ఆఫీసర్ గాలి యాదయ్య ఇంట్లో జూన్ 30న జరిగిన దొంగతనంలో 22 తులాల బంగారం, 80 తులాల వెండి చోరీకి గురైనట్టు నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నార్కట్‌పల్లి సీఐ ఆధ్వర్యంలో ఎస్ఐ నార్కట్‌పల్లి, సిబ్బంది పలు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్న క్రమంలో ఆదివారం ఉదయం 5.00 గంటలకు నమ్మదగిన సమాచారం మేరకు నార్కట్‌పల్లి గ్రామ శివారులోని రెడ్డయ్య ఫ్యాక్టరీ పక్కన వెంచర్‌లో నలుగురు వ్యక్తులు గంజాయి అమ్మకాలు చేస్తున్నట్టు సమాచారం అందింది. ఈ మేరకు నార్కట్‌పల్లి ఎస్ఐ డి క్రాంతికుమార్, వారి సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా.. హైదరాబాద్‌కు చెందిన 14, 16 ఏళ్ల ఉన్న ఇద్దరు మైనర్లయిన బాజపల్లి జోసెఫ్, బోస్‌తో పాటు మహిళ ఎరిక్ విల్సన్ మేరీనా, మరో నిందితుడు మాలిక్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించగా సులభంగా డబ్బులు సంపాదించడానికి గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. వీరు దొంగతనాలు చేస్తుండటంతో జవహర్‌నగర్, నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. అయినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. వీరి వద్ద కత్తి, బల్లెం వంటి మారణాయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసును ఛేదించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కాంగ్రెస్ పాలనలో ఎరువుల కొరత : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా, రైతు రుణమాఫీ మాత్రమే కాదు.. ఎరువులకు కూడా కరువొచ్చిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా ఆరోపించారు. అప్పు తెచ్చి వ్యవసాయం చేద్దామన్నా.. కనీసం ఎరువు బస్తా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.94 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఎందుకు ఉందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.266 ఉండాల్సిన యూరియా బస్తా ధర.. ఇప్పుడు రూ.325కి చేరిందని ఆరోపించారు. కృత్రిమ కొరత సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీలను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలి

- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


కేంద్రంలో మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనీ, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. లేబర్‌కోడ్‌ల రద్దు కోరుతూ ఈ నెల 9న దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ యూనియన్ సమావేశం జరిగింది.

బ్లాస్టింగా?.. టిబిఎం మిషనా?

- ఆగుతూ సా..గుతున్న ఎస్‌ఎల్‌బిసి పనులు
- సాంకేతిక పరిజ్ఞానం పేరుతో కాలయాపన
- హెలికాప్టర్ సర్వే అనంతరం మొదలుపెట్టే యోచనలో ప్రభుత్వం
- కమిటీ రిపోర్టు వచ్చాకేనంటున్న అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరువు ప్రాంతాలను సస్యశ్యామలం చేయడం కోసం ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్టును నిర్మించాలని 1979లో చర్చ మొదలై 1982 జులై 29న 480 కోట్లతో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పనులను ప్రారంబించడానికి జిఒ జారీ చేసింది. 43 ఏళ్లుగా ఆగుతూ.. సాగుతూ.. ఎస్‌ఎల్‌బిసి పనులు జరుగుతున్నాయి. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం, తగినన్ని నిధులు కేటాయించకపోవడం, అధికారులు, ఇంజినీర్ల ఉదాశీనత, కాంట్రాక్టు సంస్థలు ముందుకు రాకపోవడం, పలు సాంకేతిక కారణాలు.. ఈ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తూ వచ్చాయి. తాజాగా ఇటీవల మళ్లీ పనులు మొదలు పెట్టగా శ్రీశైలం ఎడమగట్టు దోమలపెంట దగ్గర సొరంగంలో మట్టికూలి ఇద్దరు ఇంజినీర్లు, ఆరుమంది కార్మికులు సజీవ సమాధి అయ్యారు. అందులో రెండు మృతదేహాలను వెలికితీశారు. మరో ఎనిమిది మంది జాడలేదు. అన్ని రకాల ప్రయత్నాలు చేసి చివరికి పనులు నిలిపేశారు. 60 రోజులు 24 గంటలు 12 రంగాలకు చెందిన సిబ్బంది శక్తివంచన లేకుండా ఎంతో పయత్నం చేశారు. అత్యంత ప్రవమాదకరమైన స్థలం కావడం చేత మిగతా వారిని మట్టి నుండి బయటకు తీయలేక పోయారు. పదేండ్లుగా ఈ



ప్రాజెక్టు పనులు చేయలేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పనులు మొదలు పెట్టామని కాంగ్రెస్ చెబుతున్నా.. సొరంగం పైకప్పు కూలడం, కార్మికులు సజీవ సమాధి కావడం ప్రభుత్వాన్ని నిరాశకు గురి చేసింది. సరైన ప్రణాళిక లేకుండా పనులు మొదలు పెట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్న విమర్శలు ఉన్నాయి. అయితే, ఎనిమిది మంది బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి ఇస్తామన్న రూ. 25 లక్షల రూపాయల చెక్కును రాష్ట్ర ప్రభుత్వం అందజేసినట్టు అధికారులు తెలిపారు. మృతిచెందిన కార్మికుల జాబితాను వారు ఉంటున్న ఆ రాష్ట్రాల అధికారులకు తెలియజేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అసలు ఎస్-ఎల్‌బీసీ పనులు జరుగుతాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతుండగా, కచ్చితంగా పూర్తి చేస్తామని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీహరి పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు. అయితే, ఎలా పూర్తి చేస్తారన్న దానిపైనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

శ్రీశైలం దగ్గర కృష్ణానది సమీపంలో దోమలపెంట దగ్గర సొరంగం ఇన్‌లెట్ 13.85 కిలోమీటర్ల దగ్గర ప్రమాదం జరిగింది. 10 మీటర్ల వెడల్పు 129 మీటర్ల పొడువున్న టీబీఎం మిషన్‌తో పనులు జరుగుతుండగా జరిగిన ప్రమాదంలో మట్టి పై కప్పు కూలి ఎనిమిది మంది సొరంగంలో చిక్కుకున్నారు. కార్మికులను బయటకు తీయడానికి ఊట నీరు పై నుండి పడుతున్న మట్టి ప్రమాదకరంగా మారింది. ఆర్మీ, ఎన్‌టీఆర్ఎఫ్, సింగరేణి, ఎస్‌డీఆర్ఎఫ్, నేవీ, హైడ్రా దక్షిణ మధ్య రైల్వే, ర్యాట్ హోల్ మైనర్స్, ఎన్‌జీఆర్ఐ, జీఎస్ఐ వంటి 12 రంగాలకు చెందిన నిపుణుల ఆధ్వర్యంలో సొరంగంలో శ్రమించి కార్మికులను సురక్షితంగా తేవడానికి విశ్వ ప్రయత్నం చేశారు. అయినా వీరి కృషి ఫలించలేదు.

సొరంగం పనులు పూర్తికి ఆర్మీ సహకారం..

సొరంగం పనులు పూర్తి చేయడానికి ప్రభుత్వం ఆర్మీ సహకారాన్ని కోరినట్టు తెలిసింది. ఆర్మీ సహకారం కోసం రక్షణ శాఖను కోరగా వారినుంచి అంగీకారం వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. దీంతో నిపుణుల కమిటీ వేశారు. ఈ కమిటీ ఇచ్చిన తర్వాత సర్వే మొదలు పెట్టే అవకాశాలు ఉన్నాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. టన్నెల్ పనులు పూర్తి చేయ డానికి కల్నల్ పరిక్షిత్ మెహ్రా, హరిపాల్‌సింగ్‌లను నియమించారు. సర్వే కోసం అనుమతులు రాగానే హెలిక్యాప్టర్ ద్వారా భూమి లోపల ఉన్న పొరలను అధ్యయనం చేస్తారు. భూమిలో ఉన్న పొరల్లో లూజ్ మట్టిని కూడా అధ్యయనం చేయనున్నారని తెలిసింది. అయితే సర్వే పూర్తయిన తర్వాత టీబీఎం మిషన్ ద్వారానా లేక బ్లాస్టిక్ ద్వారా పనులు పూర్తి చేయాలా అనేది ప్రభుత్వం నిర్ణయం మీద ఆధారపడి ఉంది. టీబీఎం కోసం ఇప్పటికే జర్మనీ నుండి బేరింగ్‌తో పాటు పలు విడిబాగాలు తెప్పించి సిద్ధం చేశారు. అన్ని అనుకూలంగా జరిగితే మరో 15 రోజుల్లో పనులు మొదలవుతాయని తెలుస్తోంది.

సర్వే తర్వాతనే పనులు మొదలు - చక్రపాణి,ఎస్‌ఎల్‌బిసి డిఇ

ఎస్‌ఎల్‌బీసీలో ప్రమాదం జరిగిన తర్వాత సొరంగం లోపల పనులు ఎప్పుడు ప్రారంభం చేయాలనే దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. టిబిఎం మిషన్ ద్వారానా లేక బ్లాస్టింగ్ ద్వారా పనులు చేయాలా అనేది కూడా ప్రభుత్వమే చర్చిస్తుంది. హెలీక్యాప్టర్ సర్వే అనంతరం పనులు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.